సాక్షి నంద్యాల

సోమవారం, 2, అక్టోబర్, 2023



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి మేళ తాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.



ఖగ్గల్‌లో చిరుత సంచారం

మంత్రాలయం: మండల పరిధిలోని ఖగ్గల్ సమీపంలో ఉన్న కొండల్లో చిరుత పులి సంచరిస్తోంది. దీంతో సమీపంలోని పంట పొలాలకు వెళ్లాలంటే రైతులు జంకుతున్నారు.



ఆదర్శమూర్తి.. ఉద్యమ దీప్తి

భారత స్వాతంత్య్రోద్యమంలో భాగంగా మహాత్మా గాంధీ ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు సార్లు పర్యటించారు. మహాత్ముడి ఉపన్యాసాలు లక్షలాది మందిలో ఉద్యమ స్ఫూర్తిని నింపాయి. 8లో

న్యూస్‌రీల్

శ్రీగిరికి పోటెత్తిన భక్తులు



క్యూలైన్ల వద్ద వేచి ఉన్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వరుస సెలవుల నేపథ్యంలో శ్రీశైల మల్లన్న క్షేత్రానికి భక్తుల రద్దీ పెరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. వేకువ జామున్నే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, మల్లన్న దర్శనానికి క్యూలైన్ల వద్దకు చేరుకున్నారు. భక్తుల రద్దీతో ఆలయ ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. మల్లన్న సర్వదర్శనానికి 5గంటలు, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనానికి 2గంటల సమయం పట్టింది. భక్తులకు కంపార్ట్‌మెంట్లలో, క్యూలైన్లలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థాన అధికారులు పర్యవేక్షణ చేపట్టారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు మంచినీరు, అల్పాహారం, బిస్కెట్లను పంపిణీ చేశారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తులందరికీ త్వరితగతిన సౌకర్యవంతమైన స్వామివారి దర్శనాన్ని దేవస్థాన అధికారులు కల్పిస్తున్నారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రధాన వీధులన్ని కిటకిటలాడాయి.

ఎల్లెల్సీలో 713 క్యూసెక్కుల నీటి ప్రవాహం

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)లో 713 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. కొద్ది రోజులుగా కాలువలో ప్రవాహం నిలకడగా ఉంటోంది. తుంగభద్ర జలాశయం పూర్తి సామర్థ్యం 1,633 అడుగులుండగా సోమవారం 1617.94 అడుగులతో 105.788 టీఎంసీలకు గాను 55.737 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 1,220 క్యూసెక్కులుండగా ఔట్‌ఫ్లో 9,781 క్యూసెక్కులుంది.

చెక్కభజన కళాకారుడికి శాంతి పురస్కారం

కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లె గ్రామానికి చెందిన చెక్క భజన కళాకారుడు విశ్వనాథ్‌కు మహాత్మా గాంధీ పురస్కారం దక్కింది. ఆదివారం శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన కళాకారులకు హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో మాజీ ఎంపీ రుద్రరాజు పద్మరాజు, దర్శకుడు మాగంటి బాబు, నటులు పద్మారెడ్డి, మద్దాల మాధవరావు చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో రాణిస్తున్న వారికి ఈ అవార్డులు ప్రదానం చేశారు. ఈకోవలోనే కనకాద్రిపల్లెకు చెందిన దివ్యాంగుడు విశ్వనాథ్ చెక్కభజనలో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తుండటంతో అవార్డుకు ఎంపిక చేసినట్లు చెక్క భజన కళాకారుల అభివృద్ధి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు అమ్మలదిన్నె కుళ్లాయప్ప తెలిపారు.



విశ్వనాథ్‌కు అవార్డు అందజేస్తున్న దృశ్యం

నవోదయానికి నాలుగేళ్లు

మహాత్ముడి స్వప్నం.. జగనన్న సంకల్పం.. వెరసి గ్రామ స్వరాజ్యం ఆవిష్కృతమైంది. 'గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు.. పల్లెలు అభివృద్ధి సాధిస్తే నగరం, దేశం, రాష్ట్రం అభ్యున్నతి సాధిస్తుంది. గ్రామ స్వరాజ్యమే నా ఆశయం' అన్న గాంధీజీ కలలను సాకారం చేస్తూ నాలుగేళ్ల క్రితం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవోదయానికి నాంది పలికారు. సచివాలయ వ్యవస్థను స్థాపించి పల్లె ముంగింటకే ప్రభుత్వ సేవలు అందిస్తుండటంతో ప్రజలు వేనోళ్ల కొనియాడుతున్నారు. సచివాలయ ఉద్యోగులకు వలంటీర్ల వ్యవస్థ తోడై ప్రభుత్వ సేవలు వెల్లివిరిస్తున్నాయి.



కానాల గ్రామంలోని సచివాలయ భవనం

- ప్రజల చెంతకే పాలన తీసుకొచ్చిన ప్రభుత్వం
- సచివాలయ వ్యవస్థ ఆవిర్భావానికి నాలుగేళ్లు పూర్తి
- జిల్లా వ్యాప్తంగా 526 గ్రామ, వార్డు సచివాలయాలు
- 3,282 మంది ఉద్యోగుల విధుల నిర్వహణ
- పారదర్శక పాలనను హర్షిస్తున్న ప్రజలు
- నేడు జిల్లా వ్యాప్తంగా 'జగనన్నకు వందనం'

జిల్లాలో గ్రామ సచివాలయాలు.. 409	వార్డు సచివాలయాలు .. 107
విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు.. 3,282	
జిల్లాలో నిర్మిస్తున్న సచివాలయాల సంఖ్య 414	
నిర్మాణానికి ప్రభుత్వం వెచ్చిస్తున్న ఖర్చు.. రూ.165 కోట్లు	



సచివాలయంలో సేవలు పొందుతున్న ప్రజలు

సాక్షి, నంద్యాల: ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించేందుకు, సంక్షేమ పథకాలను పేదల చెంతకు చేర్చేందుకు నాలుగేళ్ల క్రితం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తెచ్చిన సచివాలయాలు సేవాలయాలుగా మారాయి. గ్రామ స్వరాజ్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచాయి. గతంలో అర్హత ఉన్నా ప్రభుత్వ పథకాలు పొందాలంటే ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ నాయకుల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణ చేయాల్సిన దుస్థితి. అధికారులకు లంచాలు, నాయకుల సిఫారసు ఉంటేనే లబ్ధిదారుల జాబితాలో పేరు ఉండేది. ఏదైన ధ్రువీకరణ పత్రాలు అవసరమైనా అదే పరిస్థితి. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, అక్రమాలకు చరమగీతం పాడుతూ పాలనను ప్రజల చెంతకు చేర్చుతూ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. 2019 అక్టోబర్ 2వ తేదీన గ్రామ, వార్డు సచివాలయాల ఏర్పాటుతో ప్రజలకు వ్యవప్రయాసలు తప్పాయి. పాలన వికేంద్రీకరణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 526 గ్రామ, వార్డు సచివాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటి పరిధిలో 3,282 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. మొదటి రెండేళ్లు రూ.15 వేల వేతనం అందుకున్న వీరు.. ప్రొబేషన్ పూర్తయిన వెంటనే దాదాపు రూ.30 వేల వరకు వేతనం తీసుకుంటున్నారు. సొంత మండలంలోనే ఉంటూ, ప్రభుత్వ సేవలను అర్హులైన వారందరికీ అందజేస్తూ మన్ననలు పొందుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా సచివాలయాలు మారాయి. ఇక్కడి సిబ్బంది సంక్షేమ పథకాల అమలులో పారదర్శకంగా వ్యవహరించడంతో పాటు ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతున్నారు.

నేడు జిల్లా వ్యాప్తంగా 'జగనన్నకు వందనం'

గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ఏర్పడి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు సోమవారం జగనన్నకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సచివాలయ వ్యవస్థ రూపకర్త అయిన సీఎం వైఎస్ జగన్‌కు ఏటా అక్టోబర్ 2న కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమాన్ని నాలుగేళ్లుగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

అర్హత ఉంటే చాలు...!

పైసా లంచం ఇవ్వకుండా, ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తామున్న ఊరు, వార్డుల్లోనే ప్రభుత్వ సేవలు పొందగలుగుతున్నారంటే దానికి కారణం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయాలే. జనన ధ్రువీకరణపత్రం, బియ్యం కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు, పెన్షన్ కార్డు, ఇంటి స్థలం పట్టా, ఇన్‌కం సర్టిఫికెట్, భూ రికార్డులు, విద్యుత్ సమస్యల పరిష్కారం, మంచి నీటి కనెక్షన్ ఇలా సుమారు 550కి పైగా సేవలు ఎలాంటి కాలయాపన లేకుండా, నిర్ణీత గడువులోగానే ప్రజలకు అందుతున్నాయి.

ఆనందంతో కన్నీళ్లు వచ్చాయి



నా భర్త దూరమై బిడ్డ హుసేన్‌బీ వద్ద ఉన్న నాకు ఒంటరి మహిళ పింఛన్ కోసం ఎన్నో ఏళ్లుగా దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండా పోయింది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక మొదట రేషన్ కార్డు వచ్చింది. తర్వాత సచివాలయాల ద్వారా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే పింఛన్ మంజూరు కావడాన్ని నమ్మలేకపోయా. రేషన్ కార్డు మాదిరిగా పింఛన్ కూడా త్వరగా వస్తుందని ఊహించలేకపోయా. సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చి పింఛన్ గుర్తింపు కార్డు ఇస్తున్న సమయంలో కళ్లలో నీళ్లు తిరిగాయి. జగనన్న రుణం ఎన్నడూ తీర్చుకోలేను.

– ప్రొద్దుటూరు హుసేనమ్మ, కానాల గ్రామం, నంద్యాల మండలం

ప్రజా సేవలో సంతృప్తిగా ఉంది



నేను 2012లో ఎంటెక్ పూర్తి చేశా. తర్వాత ప్రైవేటు ఉద్యోగం చేసేదాన్ని. ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే ప్రభుత్వ ఉద్యోగానికి ప్రయత్నం చేశా. జగనన్న సీఎం కాగానే సచివాలయాల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఊరికి సమీపంలోనే ఉద్యోగం చేసే అవకాశం లభించింది. ఈ ఉద్యోగంతో కుటుంబానికి అండగా ఉండటంతో పాటు ప్రజా సేవలో ఎంతో సంతృప్తిగా కలుగుతోంది.

– జి. జ్యోతి, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, చాబోలు

ప్రజలకు ఎంతో మేలు



సచివాలయ వ్యవస్థతో ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కింది. ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటికి తీసుకురావడం చారిత్రక నిర్ణయం. చిన్ని చిన్న సమస్యలో ఉన్న ఊరిలో పరిష్కారమవుతుండటంతో ఊరట చెందుతున్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజలకు మేలు జరగడంతో పాటు ప్రభుత్వానికి మంచి పేరు వస్తోంది.

– జె. మహెబూబ్ జీశాన్, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ, 7వ వార్డు, నంద్యాల

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



అన్ని పథకాలకు అవసరమైన రేషన్ కార్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. గతంలో కార్డు కోసం పలుమార్లు దరఖాస్తులు చేసుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. సచివాలయ వ్యవస్థ రావడం, వలంటీర్లు ఇంటికి వచ్చి కుటుంబ సమాచారం తీసుకొని రేషన్ కార్డు వచ్చేందుకు కృషి చేశారు. కుటుంబానికి కార్డు రావడం సంతోషంగా ఉంది. కార్డు మంజూరు చేసిన ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– ఎంఆర్‌టీ ప్రసాద్, రెవెన్యూ క్వార్టర్స్, నంద్యాల

యువత క్రమశిక్షణతో మెలగాలి



5కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

నంద్యాలటౌన్: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణ అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా సూచించారు. ఆదివారం జిల్లా వైద్యారోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణల ఆధ్వర్యంలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కోసం 5కే రన్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ శారీరక ఆరోగ్యం చేసే వ్యాయామంలో పరుగు ముఖ్య పాత్ర వహిస్తుందన్నారు. పరుగెత్తడం వలన శరీరదృఢత్వంతో పాటు మానసికోల్లాసం కూడా కలుగుతుందన్నారు. అనంతరం ఆయన 5కే రన్‌ను ప్రారంభించారు. పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచిన సత్యమయ్యకు రూ. 10 వేలు, రెండో స్థానంలో నిలిచిన వెంకట పవన్‌కు రూ.7వేలు, మూడో స్థానంలో నిలిచిన వెంకట సునీల్‌కు రూ.5వేలు, కన్సాలిడేషన్ బహుమతుల కింద లహరి, భార్గవి, సోమియా, తేజస్వి, యశ్వంత్ కుమార్, కృష్ణవంశీలకు ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున జిల్లా లెప్రసి ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ శారదా బాయి, మునిసిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డి ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, లెప్రసీ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, జిల్లా సాక్స్ మేనేజర్ అలీహైదర్ పాల్గొన్నారు.

పోలీసు స్పందన నేడు రద్దు

బొమ్మలసత్రం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే పోలీసు స్పందన కార్యక్రమాన్ని గాంధీ జయంతి సందర్భంగా ఈనెల 2వ తేదీ తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు సుదూర ప్రాంతాల నుంచి జిల్లా ఎస్పీ కార్యాలయానికి రావద్దని విజ్ఞప్తి చేశారు. తదుపరి సోమవారం నుంచి ఈ కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తామన్నారు.

సెలవు రోజూ .. పింఛన్ అందెన్

- జిల్లాలో 80 శాతం పింఛన్ల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): వైఎస్సార్ ఆసరా పింఛన్ల పంపిణీ రాష్ట్ర ప్రభుత్వం ఠంచన్‌గా పంపిణీ చేస్తోంది. అక్టోబర్ 1వ తేదీ ఆదివారం సెలవు రోజు అయినా సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శులు, వలంటీర్లు తెల్లవారుజాము నుంచే లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. నంద్యాల జిల్లాలోని 2,23,208 మంది పింఛన్‌దారులకు రూ.61.65 కోట్ల నగదును ప్రభుత్వం మంజూరు చేసి పంపిణీ చేశారు. మొదటి రోజు జిల్లాలో 80 శాతం పంపిణీ పూర్తయినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మొదటి రోజునే భారీ ఎత్తున ఫించన్‌లు పంపిణీ చేయడం విశేషం. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్లు పంపిణీ చేయనున్నారు. మొత్తం 16 రకాల పింఛన్లను వానొచ్చినా.. సెలవు వచ్చినా 1వ తేదీనే ఠంచన్‌గా ప్రభుత్వం పంపిణీ చేయడంతో అవ్వాతాతల్లో హర్షం వ్యక్తమవుతోంది.



నంద్యాల నూనెపల్లె ప్రాంతంలో దివ్యాంగుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

పెండింగ్ కేసులపై దృష్టి సారించండి

- హైకోర్టు జడ్జి బి.కృష్ణమోహన్

కర్నూలు (లీగల్): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించాలని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం ఉదయం జిల్లా కోర్టు హాల్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు అధ్యక్షతన ఉమ్మడి జిల్లా న్యాయమూర్తులతో పెండింగ్ కేసుల పరిష్కారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గడిచిన తొమ్మిది నెలలకు సంబంధించి కోర్టుల వారీగా ఆయా న్యాయమూర్తులు నివేదికలు సమర్పించారు. జిల్లాలో కేసుల పరిష్కారం సంతృప్తికర స్థాయిలో జరుగుతోందని, రానున్న రోజుల్లో న్యాయమూర్తులు ఇదే విధంగా కృషి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి కోరారు. సమావేశంలో అదనపు జిల్లా జడ్జీలు, సబ్ జడ్జీలు, జూనియర్ సివిల్ జడ్జీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి బి.కృష్ణమోహన్

జిల్లాలో ఎరువులు పుష్కలం

- డీఏవో మోహనరావు

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా అన్నదాతలకు ఎరువులు పుష్కలంగా అందుబాటులో ఉన్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహనరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. హోల్‌సేల్, రిటైల్‌తో పాటు రైతు భరోసా కేంద్రాల్లోనూ అవసరమైన ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు. యూరియా రిటైల్ షాపుల్లో 6543.74 టన్నులు, హోల్‌సేల్ దుకాణాల్లో 228.265 టన్నులు వెరసి 6772.01 టన్నులు నిల్వ ఉన్నాయని తెలిపారు. డీఏపీ రిటైల్-4800.285, హోల్‌సేల్-223.89 కలిపి మొత్తం 5024.180 టన్నులు అందుబాటులో ఉందన్నారు. ఎంవోపీ రిటైల్-986.20, హోల్‌సేల్-29తో కలిపి మొత్తం 1015.20 టన్నుల నిల్వ ఉందని పేర్కొన్నారు. అదే విధంగా ఎన్‌పీకే(కాంప్లెక్స్) రిటైల్-13770.405 టన్నులు, హోల్‌సేల్-4526.81 టన్నులు వెరసి మొత్తం 18297.22 టన్నుల నిల్వలున్నాయన్నారు. ఎస్ఎస్‌పీ రిటైల్-948.195 టన్నులు, హోల్‌సేల్-26.215 టన్నులు కలిపి మొత్తం 974.41 టన్నులు అందుబాటులో ఉందన్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద అన్ని రకాల ఎరువులు కలిపి 1209.24 టన్నుల నిల్వ ఉందని తెలిపారు.

ఏటీఎం మోడల్.. ఏడాదంతా మనీ

- నూతన పద్ధతిలో కూరగాయల సాగు
- తక్కువ విస్తీర్ణంలో పలు రకాల సాగుతో లాభాలు
- ఆసక్తి చూపుతున్న రైతులు



దోన్ మండలం ధర్మవరంలో ఏటీఎం మోడల్‌లో సాగు చేసిన పంటలు



బనగానపల్లె మండలం యనకండ్లలో మహిళలు పండించిన కూరగాయలు

నంద్యాల(సెంట్రల్): పురుగు మందులు, రసాయనిక ఎరువులను వాడకుండా సాగుతున్న ప్రకృతి వ్యవసాయం ఓ సరికొత్త సామాజిక ఉద్యమంలా మారుతోంది. ఈ నూతన వ్యవసాయం జిల్లా వ్యాప్తంగా విస్తరిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం నిజంగానే 'రైతును రాజు'గా మార్చుతోంది. ఇందులో భాగంగా ఏటీఎం అనే కార్యక్రమం ద్వారా 20 సెంట్లలో అనేక రకాల కూరగాయలు, పండ్లు సాగు చేస్తూ ప్రతి నెలా కనీసం రూ.10-25 వేల ఆదాయం పొందే మార్గం ఉంది. చిన్న, సన్నకారు రైతులకే కాదు, భూమిలేని వ్యవసాయ కార్మికులకూ వరం లాంటిది. ఏటీఎం మోడల్ విధానంలో సాగు చేసిన పలు రకాల కూరగాయలు, ఆకు కూరలు సాగు చేసిన 45 రోజుల నుంచే దిగుబడి రావటం ప్రారంభమవుతుంది. ఏడాది పొడవునా రకరకాల కూరగాయలు వాటి పంట కాలం బట్టి దిగుబడి వస్తూ ఉంటాయి. ఫలితంగా నిత్యం కోతలే...రోజూ కాసుల గలగలలే వినిపిస్తుంటాయి. ప్రస్తుతం జిల్లాలో ఈ ఏటీఎం మోడల్లో డోన్, బేతంచెర్ల, ఆత్మకూరు, బనగానపల్లె, మహానంది, చాగలమర్రితో పాటు పలు మండలాల్లో రైతులు కూరగాయ పంటలను సాగు చేసి లాభాల బాటలో పయనిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 96 ఏటీఎం మోడళ్లను రైతులు సాగు చేస్తున్నారు.

ఏయే పంటలు సాగు చేస్తారంటే..

జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 96 ఏటీఎం మోడల్ కూరగాయల పంటలు సాగులో ఉన్నాయి. ఈ ఏటీఎం మోడల్ కింద టమాట, వంగ, మటిక, మిరప, ముల్లంగి, క్యారెట్, బీట్‌రూట్‌తో పాటు గోంగూర, పాలకూర, మెంతాకు, కొత్తిమీర వంటి ఆకుకూరలు పండిస్తారు. వీటితో పాటు తీగజాతి కూరగాయలైన బీర, కాకర, సొర, చిక్కుడు వంటివి సాగుచేస్తున్నారు. వీటిలో కొన్ని కూరగాయలు సాగు చేసిన 25 నుంచి 30 రోజులకు కోతలు ప్రారంభమవుతాయి. మరికొన్ని 45 రోజులకు ఇంకొన్ని 90 రోజులకు దిగుబడి వస్తుంది. ఇలా ఏడాదంతా కూరగాయలను పండించుకుంటూ డబ్బులను సంపాదిస్తున్నారు.

ఉన్న ఊర్లోనే...

తక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన కాయగూరలు, ఆకు కూరలను తాము ఉన్న గ్రామంలోనే మార్కెటింగ్ చేసుకునే అవకాశం ఉంటుంది. మార్కెట్ ధరలకు అనుగుణంగా కిలో చొప్పున వినియోగదారులకు అందిస్తున్నారు. వీటితో పాటు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పురుగు మందులు, రసాయనిక ఎరువులు వాడకుండా కేవలం కషాయాలు, జీవామృతం, ఘనామృతంతోనే పండించే కూరగాయలు కావటంతో ప్రజలు వీటిని తీసుకునేందుకు బాగా ఆసక్తి కనబరుస్తున్నారని రైతులు తెలిపారు. అందులోనూ ఉన్న ఊర్లోనే కళ్లెదుటే పండిన కూరగాయలు కాబట్టి తాజాగా ఉండటంతో అందరూ కొంటున్నారని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లా వ్యాప్తంగా సాగు చేసిన ఏటీఎం మోడళ్లలో సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులన్నీ ప్రాచీన ప్రకృతి సేద్య విధానంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. తక్కువ విస్తీర్ణంలో సాగు...పైగా ఖర్చు కూడా తక్కువగా ఉండటంతో చాలా మంది సాగు చేస్తున్నారు. పలు దశల్లో ఉన్న ఈ పంటల ఫలితాలు అద్భుతంగా ఉంటున్నాయి. మేము కూడా సిబ్బందితో ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహిస్తున్నాం. ఇప్పటిదాకా జిల్లా వ్యాప్తంగా 96 మోడళ్లు సాగులో ఉన్నాయి.

– నరేంద్రారెడ్డి, ప్రాజెక్టు మేనేజర్, ప్రకృతి సేద్యం

నెల ఆదాయం రూ. 15 వేలు



ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి ఉండటంతో 20 సెంట్ల పొలంలో ఏటీఎం మోడల్ సాగు మొదలు పెట్టాను. ముల్లంగి, క్యారెట్, బీట్రూట్, అలసంద, మట్టిక, టమాట, మిరప, వంగ పంటలు వేశాను. దుక్కి, బెడ్ తయారీ, ఘన జీవామృతం, బీజామృతం, విత్తనాలు, నాట్లు, ద్రవ జీవామృతం, కలుపు, లింగాకర్షక బుట్టలు, పసుపు తెలుపు పల్లాల ఖర్చు వెరసి రూ.3,510 మాత్రమే పెట్టుబడి పెటాను. కోతకు రూ.3,500 ఆదాయంతో నెలకు 3 నుంచి నాలుగు పంటలు తీస్తూ రూ.12 వేల నుంచి రూ.15 వేల దాకా అన్ని ఖర్చులు పోనూ ఆదాయం పొందుతున్నాను.

– ఎస్. రామకృష్ణ, ప్యాపిలి

తోట వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు



ఇంటి వద్ద ఉన్న కల్లంలోనే ఏటీఎం మోడల్ కూరగాయల సాగు చేపట్టాను. బెండ, మిరప, మట్టి కాయ, మునగతో పాటు మెంతి కూర పండిస్తున్నాను. ప్రకృతి సేద్యం అధికారుల సలహాలతో తక్కువ పెట్టుబడితో మందుల ప్రభావం లేని కూరగాయలు పండిస్తుండటంతో ఊళ్లోని వాళ్లు కల్లం దగ్గరకే వచ్చి కొనుక్కుని వెళ్తున్నారు. తాజాగా ఉండటంతో పాటు, ధర తక్కువ కావటంతో కోసినవి కోసినట్టే అమ్ముడుపోతున్నాయి. నెలకు అన్ని ఖర్చులు పోనూ రూ.10 వేల ఆదాయం పొందుతున్నాను. – లలిత, యనకండ్ల, బనగానపల్లె

ప్రాధాన్యత భవనాలు దేశానికే ఆదర్శం



యు. కొత్తపల్లి ఆర్‌బీకే వద్ద బాలునాయక్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

డోన్/టౌన్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డుల్లో నిర్మించిన సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ క్లినిక్ భవనాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ అండ్ చీఫ్ బాలునాయక్ అన్నారు. ఆదివారం డోన్ డివిజన్ పరిధిలోని ప్యాపిలి, డోన్ మండలాలలోని గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను ఆయన తనిఖీలు చేశారు. డోన్ మండలం యు. కొత్తపల్లె గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లను తనిఖీచేసి రైతుభరోసా కేంద్రం, గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. ప్రభుత్వ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సచివాలయాల పరిధిలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్స్‌కు త్వరలో పదోన్నతి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏఎన్ఎం లతా మంగేశ్వర్‌తో ఆయన బీపీ, షుగర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. ఆయన వెంట పీఆర్ఈఈ రామకృష్ణారెడ్డి, డీఈ నాగిరెడ్డి, ఏఈ నారాయణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శేషారెడ్డిలను ఆయన అభినందించారు.

క్లుప్తంగా

హస్తకళలను ప్రోత్సహిద్దాం

- లేపాక్షి క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కాటసాని



లేపాక్షి క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): హస్తకళలను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కర్నూలులోని దేవీ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక ప్రదర్శన, అమ్మకాల ఎగ్జిబిషన్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో 40కిపైగా స్టాళ్లు ఏర్పాటు చేశారు. స్టాళ్లలోని హస్తకళలను ఎమ్మెల్యే కాటసాని ఆసక్తిగా పరిశీలించారు. చేనేత వస్త్రాలు, హస్తకళలకు ఆదరణ తగ్గే అవకాశం లేదని అన్నారు. ఎగ్జిబిషన్‌ను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లేపాక్షి హస్త కళా ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య మాట్లాడుతూ... ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 15 వరకు ఉంటుందని పేర్కొన్నారు. సెలవు రోజులతో సహా ప్రతి రోజు ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు ఎగ్జిబిషన్ నడుస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, లేపాక్షి హస్తకళల ఎంపోరియం సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోలో ప్రయాణిస్తుండగా.. బంగారు నగలు మాయం

కర్నూలు: ఏపీఎస్‌పి రెండో బెటాలియన్‌లో పనిచేస్తున్న ఎఆర్ఎస్సై సుబ్బారెడ్డికి సంబంధించిన బంగారు నగలు ఆటోలో మాయమయ్యాయి. భార్య ప్రమీలతో కలిసి ఈనెల 26వ తేదీన కొత్తబస్టాండ్‌కు ఎదురుగా ఉన్న గోపీ హోటల్‌లో టిఫిన్ చేసి వెంకటరమణ కాలనీలోని ఇంటికి ఆటోలో వెళ్లారు. అందులో మరో ఇద్దరు యువకులు సైతం ప్రయాణించారు. బ్యాగ్‌లో ఒక బ్యాక్స్‌లో భద్ర పరచిన 12 తులాల బంగారు నగలు మాయమయ్యాయి. ఈ మేరకు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో బాధితుడు సుబ్బారెడ్డి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకరయ్య తెలిపారు.

అన్నదాన పథకానికి విరాళాలు



కర్నూలుకు చెందిన దాత విజయభాస్కర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పలువురు భక్తులు ఆదివారం విరాళాలు అందజేశారు. తెలంగాణరాష్ట్రం సిద్దిపేటకు చెందిన ఇ.సాయికృష్ణ శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకున్న అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళాన్ని ఏఈవో ఫణిధర ప్రసాద్‌కు అందజేశారు. అలాగే కర్నూలుకు చెందిన ఎం.విజయభాస్కర్ దంపతులు రూ.1,00,116 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకురాలు హిమబిందుకు అందజేశారు. విరాళాలు అందించిన దాతలకు దేవస్థానం తరపున స్వామివారి శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

ఆదర్శమూర్తి.. ఉద్యమ దీప్తి

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండుసార్లు పర్యటించిన గాంధీజీ
- తుంగభద్ర నదీ తీరంలో మార్మోగిన వందేమాతర నినాదం
- నేడు మహాత్ముని జయంతి

" ప్రపంచంలో నువ్వు చూడాలనుకుంటున్న మార్పు మొదట నీతోనే మొదలు కావాలి" అని అన్నారు గాంధీజీ. విలువలే మనుషుల్ని మహనీయులని చేస్తాయని ప్రవచించిన మహాత్ముడు జాతీయోద్యమంలో భాగంగా రెండుసార్లు ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన ఉపన్యాసాలు లక్షలాది మందిలో స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని నింపాయి. వేలాది మందిని స్వాతంత్ర్య సంగ్రామంలో మమేకం చేశాయి. అక్టోబర్ 2వ తేదీ సోమవారం గాంధీజీ జయంతి సందర్భంగా మహాత్ముని మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకుందాం.

కర్నూలు కల్చరల్: భారత స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా స్వరాజ్య నిధికి విరాళాల సేకరణకు మహాత్ముడు ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించారు. ద్రోణాచలం నుంచి 1921 అక్టోబర్ 1వ తేదీన రైలులో గాంధీ కర్నూలు వచ్చారు. ఓపెన్ టాప్ జీపులో నగర వీధుల్లో తిరిగారు. ఆర్ఎస్ సర్కిల్, ఎస్‌టీబీసీ కళాశాల, స్టేట్ బ్యాంక్ సర్కిల్, పాత బస్టాండ్, గడియారం ఆసుపత్రి, పూలబజార్, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ మీదుగా మేడం వెంకయ్య ఇంటికి చేరుకున్నారు. గాంధీని చూడటానికి భారీగా ప్రజలు తరలివచ్చారు. అప్పటి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు మేడం వెంకయ్య శెట్టి, రంగనాథ మొదలియార్, గొల్లపూడి సీతారామ శాస్త్రి, గాడిచర్ల హరిసర్వోత్తమరావు మహాత్ముడి వెంట ఉన్నారు. తుంగభద్ర నదీ తీరంలో నిర్వహించిన బహిరంగ సభలో మహాత్ముడు హిందీ ప్రసంగించగా.. గాడిచెర్ల తెలుగులో అనువదించారు. స్వరాజ్య సాధన కోసం ప్రతి ఒక్కరూ సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొనాలని గాంధీజీ పిలుపునిచ్చారు. సహాయ నిరాకరణోద్యమం, విదేశీ వస్త్ర బహిష్కరణోద్యమం గురించి కూడా గాంధీజీ విపులంగా తెలియజేసినప్పుడు సభలో పెద్ద పెట్టున హర్షధ్వానాలు మారుమోగాయి. సభానంతరం మేడం వెంకయ్య శెట్టి వ్యక్తిగత విరాళం కింద రూ.1,116 గాంధీజీకి ఇచ్చారు.

1929లో ఖద్దర్ యాత్ర

1929లో ఖద్దరు నిధికి విరాళాలు సేకరించేందుకు గాంధీజీ కర్నూలు జిల్లాలో రెండో సారి పర్యటించారు. జిల్లాలోని చాగలమర్రి, శిరివెళ్ల, ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, నంద్యాల, అయ్యలూరు, పాణ్యం, కర్నూలు, కొణిదేడు, నాగలాపురం, ప్యాలకుర్తి, కోడుమూరు, దేవనకొండ, పత్తికొండ, ఆదోని ప్రాంతాల్లో పర్యటించారు. గాంధీజీతో పాటు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, పత్రికా సంపాదకులు వనం శంకరశర్మ, డి.సంజీవరెడ్డి, తొమ్మండ్ర వెంకటనర్సయ్య, అగ్రహారం నర్సింహారెడ్డి, సి.బజార్ రెడ్డి, హెచ్.మాణిక్యరావు, పెండేకల్ రెడ్డి లక్ష్మమ్మ, కాదర్‌బాద్ నర్సింగరావు ఖద్దరు నిధికి విరాళాలు సేకరించి గాంధీజీకి అందించారు.



కర్నూలు వన్‌టౌన్‌లో గాంధీజీ బస చేసిన మేడం వెంకయ్య శెట్టి బంధువు గరిపాకటి ఇల్లు

మహాత్ముడు మెచ్చిన పర్ల కంబళ్లు

కర్నూలు నుంచి కోడుమూరు వెళ్లే మార్గంలో నాగలాపురంలో పర్ల గ్రామ వాస్తవ్యులు గాంధీజీని ఆపి తాము తయారు చేసిన కంబళ్లను చూపించారు. గాంధీజీ పర్ల కంబళ్లను చూసి నచ్చడంతో వారిని అభినందించారు.

ఆధునిక యోగి



సత్యాగ్రహాన్ని పో రాట మార్గంగా చూపించిన ఆధునిక యోగి మహాత్మాగాంధీ. తన జీవితాన్ని సత్య ప్రయోగశాలగా మర్చుకున్నారు. మత విద్వేషాలను పోగొట్టాలని ప్రయత్నం చేసి, తన జీవితాన్ని బలి ఇచ్చిన త్యాగమూర్తి. మహాత్ముని అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలి.

– డాక్టర్ తొగట సురేష్ బాబు, ప్రధానోపాధ్యాయులు, డోన్

గాంధీ మార్గంలో నడవాలి



అహింస, శాంతి ద్వారా దేన్నయినా సాధించ వచ్చని, ప్రేమ ద్వారా ప్రగతిని పొందవచ్చని చాటి చెప్పిన జాతిపిత మహాత్మా గాంధీ తరతరాలకు ఆదర్శ ప్రాయం. సహనం, పట్టుదల, కార్యదీక్ష, శ్రమ జీవనం వీటన్నింటికి యువత ప్రాధాన్యతనిస్తూ ప్రగతిని సాధించడానికి గాంధీజీ మార్గంలో నడవాలి.

– పూజారి రవికుమార్, ప్రధానోపాధ్యాయులు, తూడిచర్ల

రగిలిన స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి

కర్నూలు జిల్లాలో గాంధీజీ చేసిన రెండు పర్యటనలు స్థానిక నాయకుల్లో చక్కని స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని రగిలించాయి. గాడిచర్ల హరిసర్వోత్తమ రావు గాంధీజీ స్ఫూర్తితో రాజీ లేని పోరాటం చేశారు. తొలి రాజకీయ ఖైదీగా జైలు జీవితం గడిపారు. ఆంధ్ర తిలక్‌గా గుర్తింపు పొందారు. గాంధీ పర్యటన కర్నూలు వాసుల గుండెల్లో చక్కని పోరాట స్ఫూర్తిని కల్గించింది.



కర్నూలులో గాంధీజీ (ఫైల్)

రావి ఆకుపై బాపూజీ



ఎమ్మిగనూరు టౌన్: జాతిపిత మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీల జయంతిని పురస్కరించుకొని పట్టణానికి చెందిన కదిరికోట అశోక్ ఆదివారం రావి ఆకుపై వారి చిత్రాలను చిత్రించి అబ్బురపరిచారు. గతంలో బియ్యపు గింజ, అగ్గిపెట్టెపై పలువురి చిత్రాలను గీసి స్థానికుల ప్రసంశలు పొందారు. ప్రస్తుతం రావి ఆకుపై మహనీయుల చిత్రాలను చిత్రించి స్థానికుల నుంచి అభినందనలు పొందారు.

అపాస్ నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు సిటీ: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపాస్)నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం నగరంలోని ఓ స్కూల్‌లో జరిగిన ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా అధ్యక్షుడిగా చిన్న నాగస్వామి నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి, జిల్లా కోశాధికారిగా వెంకట రమణ, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా తాయప్ప, మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా ఎస్.రామ్ మోహన్ రెడ్డి, ఎన్నికల అధికారులుగా పి.కోదండరాంజీ, ఎం.వి సురేంద్రబాబుజీ, కృష్ణార్జున రెడ్డి వ్యవహరించారు.

నేటి నుంచి 'ఉపాధి' ప్రణాళిక

- డిసెంబరు 31లోపు పూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2024–25 సంవత్సరానికి అవసరమైన ప్రణాళికలు తయారీకి గ్రామీణాభివృద్ధి శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నెల 2న ఈ ప్రక్రియ మొదలై డిసెంబరు చివరి నాటికి పూర్తి చేయాల్సి ఉంది. ఒక పనిదినం అంటే రూ.448 ఉంటుంది. ఇందులో రూ.272 లేబర్ కాంపోనెంటు, రూ.176 మెటీరియల్ కాంపోనెంటు ఉంటుంది. ఈ ప్రాతిపదికన 2024–25 సంవత్సరం కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసే విధంగా ఆదేశాలు జారీ అయినట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి ఆదివారం విలేకరులకు తెలిపారు. అక్టోబరు 2న జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ ఆధ్వర్యంలో మొదటి గ్రామ సభ నిర్వహించాల్సి ఉంది. మొదటి గ్రామసభలో వచ్చే ఆర్థిక సంవత్సరం ప్లానింగ్ గురించి అవగాహన కల్పిస్తారు. అక్టోబరు 20 నాటికి పంచాయతీల వారీగా ఉన్న పనుల పునఃపరిశీంచి నవంబరు 10 నాటికి క్షేత్రస్థాయిలో ప్లానింగ్ పూర్తి చేస్తారు. నవంబరు 30న మండల ప్రణాళికలపై మండల పరిషత్ ఆమోదం తీసుకుంటారు. డిసెంబరు 15న జిల్లా పరిషత్ ఆమోదం తీసుకుంటారు. డిసెంబరు 31 నాటికి గ్రామ, మండల, జిల్లా పరిషత్‌ల ఆమోదంతో పాటు లేబర్ బడ్జెట్ పనులన్నింటికీ జిల్లా కలెక్టర్ నుంచి పరిపాలన అనుమతులు తీసుకుంటారు. దీంతో 2024–25 ప్లానింగ్ ప్రాసెస్ మొత్తం పూర్తి అవుతుంది. ఇందులో భాగంగా సోమవారం కర్నూలు శివారులోని డ్వామా శిక్షణ కేంద్రంలో ప్లానింగ్ ప్రాసెస్‌పై క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సృజన ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.

నిందితుడిపై పీడీ యాక్ట్ కేసు

- కడప సెంట్రల్ జైల్‌కు తరలింపు
- నిందితుడి భార్య ఆత్మహత్యాయత్నం

డోన్ టౌన్: పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్న శ్రీరాంనగర్‌కు చెందిన ఎరుకల మురళిపై జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పీడీ యాక్టు కింద కేసు నమోదు చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. మురళిపై డోన్‌తో పాటు వివిధ జిల్లాల్లో గంజాయి, చోరీ, తదితర 11 కేసులు నమోదైనట్లు తెలిపారు. కాగా తన భర్త మురళి గత నెల 29వ తేదీన జైలు నుంచి బయటకు వచ్చిన కొద్దిసేపటికే మళ్లీ పోలీసులు తీసుకెళ్లారని, ఎక్కడ ఉన్నాడో ఆచూకీ చెప్పలేదని భార్య భూలక్ష్మీ పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేసింది. కొద్ది సేపటి తర్వాత నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. మురళిపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేసి కడప జైలుకు తరలిస్తున్నామని పోలీసులు ఆమెకు వివరించారు. ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అతివలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- నారీ శక్తి సమ్మేళనంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన

కర్నూలు కల్చరల్: మహిళలు అవకాశాలను అందిపుచ్చుకొని అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన అన్నారు. ఆదివారం వీఆర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో జరిగిన నారీ శక్తి సమ్మేళనంలో కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. ఇలాంటి స్ఫూర్తి దాయకమైన సమ్మేళనాలు ఎన్నో జరగాలని అప్పుడే దేశ సమగ్ర అభివృద్ధికి బాటలు వేయగలుగుతామని అన్నారు. చిన్మయమిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద మాట్లాడుతూ మహిళా శక్తి మహోన్నతమైందన్నారు. కుటుంబ వ్యవస్థ బాగుండాలన్నా, సమాజం, దేశం బాగుండాలన్నా, అభివృద్ధి జరగాలన్నా నారీమణుల చేతుల్లోనే ఉందన్నారు. ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు ఐటీ ఇండస్ట్రీ టీమ్ లీడర్, హైదరాబాద్ సామజిక కార్యకర్త ముదిగొండ సుస్మ, తాడేపల్లి గూడెం స్పందన ఫౌండేషన్ చైర్ పర్సన్ బోగిరెడ్డి ఆదిలక్ష్మి రెడ్డి ముఖ్య వక్తలు హాజరై ప్రసంగించారు. మహిళలు ఏ రంగంలో తీసిపోరని చెప్పారు. మహిళా శక్తి సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి రంగంలో సమస్యలు ఉంటాయని, వాటిని అధిగమించి ముందుకు సాగాలన్నారు. దేశం మొత్తం మీద నాలుగు వందల సమ్మేళనాలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రాష్ట్రంలో ఇది రెండో సమ్మేళనం అన్నారు. వివిధ అంశాలపై చర్చా గోష్టులు నిర్వహించారు. అనంతరం ప్రదర్శించిన యోగాసనాలు, నృత్య ప్రదర్శనలు, నృత్య రూపకాలు, ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ శమంతకమణి, మాంటిస్సోరి ఇండస్ పాఠశాల కరస్పాండెంట్ గాయని రాజశేఖర్, కార్తీక దీపోత్సవ కమిటీ అధ్యక్షులు పద్మావతి, నిర్వాహకులు రాధిక, దేవకి దేవి, కృష్ణ వేణి, భవాని, రజిని, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సృజన



నృత్య ప్రదర్శన

శ్రీశైలమంతా దివ్యత్వం వ్యాప్తి

- ప్రముఖ ప్రవచకులు సామవేదం షణ్ముఖశర్మ



శ్రీశైలంటెంపుల్: ఇల కైలాసమైన శ్రీశైల క్షేత్రంలో అణువణువునా దివ్యత్వం వ్యాపించి ఉందని ప్రముఖ ప్రవచకులు సామవేదం షణ్ముఖశర్మ పేర్కొన్నారు. ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో భాగంగా శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ వారిచే శ్రీశైల మహిమా విశేషాలు అనే అంశంపై ప్రవచన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం ఆలయ దక్షిణమాఢవీధిలోని నిత్యకళావేదికపై ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ముందుగా జ్యోతిప్రజ్వలన చేశారు. అలాగే ప్రవచకులను దేవస్థాన సహాయ కమిషనర్ హెచ్.జి.వెంకటేశ్, ఈఈ వి.రామకృష్ణ పూలమాల వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రవచకులు మాట్లాడుతూ శ్రీశైలక్షేత్రానికి అనాదిక్షేత్రమనే ప్రసిద్ధి ఉందన్నారు. మేరు పర్వతం తరువాత మనం చెప్పుకునే మహాపర్వతం శ్రీశైలమే అన్నారు. సాధారణ దృష్టితో చూడలేని దివ్యక్షేత్రాలలకు, దివ్యదేవతాస్వరూపాలకు, దివ్యులైన సిద్ధపురుషులకు శ్రీశైలక్షేత్రం నిలయమన్నారు. శ్రీశైలంలో ఉన్న ప్రతి శివలింగం అమృతమయమన్నారు. శ్రీశైల మహిమను సాక్షాత్తూ బ్రహ్మదేవుడు కూడా వర్ణించలేడనే నానుడి ఎంతో ప్రసిద్ధమన్నారు. మహాభారతం శ్రీశైలక్షేత్రాన్ని దివ్యస్థలంగానే కాకుండా పవిత్రతీర్థంగా పేర్కొనదన్నారు.

చంద్రబాబు ఇక తప్పించుకోలేరు

- టీడీపీ మోతమోగిద్దాం కార్యక్రమం విఫలం
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్

కర్నూలు(రాజ్‌విహార్): సీఎంగా ఉన్న సమయంలో అనేక అవినీతి అక్రమాలకు పాల్పడి దొరికిపోయిన చంద్రబాబు ఇక తప్పించుకోలేరని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆదివారం స్థానిక సి.క్యాంప్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి సానుభూతి పొందేందుకు తెలుగుదేశం పార్టీ పిలుపు ఇచ్చిన మోత మోగిద్దాం కార్యక్రమం పూర్తిగా విఫలమైందని ఈ కార్యక్రమాలకు ప్రజల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆ పార్టీ నేతలు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. 14ఏళ్ల పాటు అధికారాన్ని అడ్డుపెట్టుకుని చంద్రబాబు రాష్ట్ర ప్రజల సంపదను కొల్లగొట్టారన్నారు. రెండెకరాల నుంచి రూ. లక్షల కోట్లకు ఆయన ఎలా ఎదిగారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు హయాలో ప్రవేశపెట్టిన స్కీములన్నింటిలోనూ స్కాములు జరిగాయని, వాటిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రింగ్ రోడ్డు, అమరావతిలో రాజధాని పేరుతో రైతుల నుంచి సేకరించిన భూమిపై కూడా విచారణ జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. లోకేష్, ఇతర టీడీపీ పెద్దల పాత్రపై కూడా దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేశ్వరరెడ్డి, యూనుస్, ధనుంజయ ఆచారి, లక్ష్మీ కాంతయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

గుర్తు తెలియని మృతదేహం

కర్నూలు: పాతబస్టాండ్ నుంచి జొహారాపురం వెళ్లే మార్గంలో బ్రిడ్జి కింద గుర్తు తెలియని మృతదేహం బయటపడింది. నీళ్లలో నుంచి ఒడ్డుకు కొట్టుకొని రావడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఒకటో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ కేంద్రానికి తరలించారు. మృతుడికి సుమారు 45 సంవత్సరాల వయస్సు ఉంటుందని, చామనఛాయ కలర్, నలుపు తెలుపు గీతల షర్టు, జీన్స్ ప్యాంట్ ధరించాడని ఒకటవ పట్టణ పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలన్నారు.

శ్రీశైలంలో 93.6 టీఎంసీల నీరు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో ఆదివారం సాయంత్రం సమయానికి 93.5810 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 855.60 అడుగులకు చేరుకుంది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి 11,854 క్యూసెక్కుల వరద నీరు జలాశయానికి వచ్చి చేరుతోంది. శనివారం నుంచి ఆదివారం వరకు 4,439 క్యూసెక్కుల నీరు దిగువ ప్రాంతాలకు విడుదలయ్యింది. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 2,000 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,525 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాం పరిసర ప్రాంతాలలో 0.80 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

పాము కాటుకు వ్యక్తి మృతి

ప్యాపిలి: జలదుర్గం గ్రామానికి చెందిన శిలివేరు రాముడు (40) పాముకాటుకు గురై శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. శనివారం తన పొలంలో పని చేసుకుంటున్న రాముడును పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు జలదుర్గం పోలీసులు తెలిపారు.

రోడ్డు విస్తరణ పనుల్లో ఉద్రిక్తత

బొమ్మలసత్రం: పట్టణంలోని బొమ్మలసత్రం నుంచి నూనెపల్లె వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను టీడీపీ శ్రేణులు అడ్డుకోవడంతో ఆదివారం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. బొమ్మలసత్రం నుంచి నూనెపల్లెకు వెళ్లే రహదారి మధ్యలో బొగ్గులైన్ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా కొందరు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారు. రోడ్డును వెడల్పు చేసే క్రమంలో ఇప్పటికే అధికారులు పలుమార్లు వారి నోటీసులు జారీ చేశారు. గుడిసెల్లో నివసించే అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేస్తామమని హామీ ఇచ్చినప్పటికీ వారు అంగీకరించలేదు. ఆదివారం ఉదయం అధికారులు పోలీసుల సహకారంతో గుడిసెల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి తన అనుచరులతో కలిసి పనులను అడ్డుకున్నారు. డీఎస్పీ మహేశ్వరరెడ్డి సిబ్బందితో కలిసి భూమా బ్రహ్మానందరెడ్డిని స్టేషన్‌కు తరలించారు.

తేనెటీగల దాడిలో వృద్ధురాలి మృత్యువాత

జూపాడుబంగ్లా: పశువులను మేపడానికి వెళ్లిన కాపరులపై తేనెటీగలు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. కనకయ్యకొట్టాల గ్రామానికి చెందిన మంగళి తిరుపతమ్మ (60), వెంకటేశ్వరరెడ్డి, మంగళి మల్లేశ్వరరావు, రాజశేఖర్ అనే పశువుల యజమానులు గేదేలను మేపేందుకు సమీపంలోని పొలాలకు వెళ్లారు. పశువులను మేపుకుని సాయంత్రం తిరుగు ముఖం పట్టిన సమయంలో తేనెటీగలు ఒక్కసారిగా వారిపై దాడి చేశాయి. ఈ దాడిలో తీవ్ర అస్వస్థతకు గురైన మంగళి తిరుపతమ్మ, వెంకటేశ్వరరెడ్డిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో తిరుపతమ్మ మృతి చెందింది. వెంకటేశ్వరరెడ్డి, మల్లేశ్వరరావు, రాజశేఖర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తేనెటీగల దాడిలో మృతి చెందిన తిరుపతమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బంధువులు కోరుతున్నారు.



మృతి చెందిన మంగళి తిరుపతమ్మ

ఉమామహేశ్వరుడి సేవలో..

బనగానపల్లెరూరల్: యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామిని సోమవారం హైకోర్టు న్యాయమూర్తి బి.కృష్ణమోహన్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తొట బుచ్చిరెడ్డితో పాటు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఏకశిలా రూపంలో కొలువైన శ్రీ ఉమామహేశ్వరస్వామికి అభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు. అనంతరం జడ్జి దంపతులను సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.



హైకోర్టు జడ్జి బి.కృష్ణమోహన్ దంపతులకు స్వామి వారి చిత్ర పటం అందజేస్తున్న ఆలయ కార్యనిర్వహణాధికారి,చైర్మన్‌లు



అదనులో పదును

దొర్నిపాడు మెట్టపొలాల్లో నిలచిన వర్షపునీరు

మెట్ట ప్రాంత రైతులు శనగ పంటను మాత్ర పంటగా భావిస్తారు. వర్షాధారిత పంట కావడంతో కేవలం మూడు నెలల్లో చేతికి రాడంతో పాటు సాగు చాలా సులభంగా ఉంటుందని రైతులు సాగుపై మక్కువ చూపుతారు. మండలంలో ఏటా 4వేల హెక్టార్లలో సాగు చేస్తారు. ఇప్పటికే పొలాల్లో రసాయన ఎరువులను విత్తి పంట సాగుకు సిద్ధంగా ఉన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు అదనుగా కురువడంతో పొలాలు పదును అయ్యాయి. ఇప్పటికే అధికారులు 1,000 క్వింటాళ్ల శనగ విత్తనాలను మంజూరు చేశారు. క్వింటా శనగ విత్తనాలు రూ.8,100 ఉండగా 40 శాతం రాయితీ పోను రైతు రూ.4860 చెల్లించాల్సి ఉంది. దీంతో రైతులు ఆయా వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలకోసి రిజిస్ట్రేషన్లు ప్రారంభించారు. అక్టోబర్ రెండో వారం నుంచి శనగ పంటను విస్తారంగా సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

– దొర్నిపాడు